క్లుప్తంగా

మోపిదేవిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



సామర్లకోటలో మోపిదేవికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కొత్తపల్లి: కాకినాడలోని ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణను బుధవారం మండల వైఎస్సార్ సీపీ నేతలు సామర్లకోటలో కలిశారు. అయనకు ఘనంగా స్వాగతం పలికారు. మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు పాలని దొరబాబు, రొంగళ వీరబాబు, సుబ్బారెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ సభ్యుడు బండి దావీదు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గింజల శ్రీనివాస్, పొన్నాడ ఉప సర్పంచ్ కారే ఉదయకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబును కలసిన సాయి



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న సాయి

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పిఠాపురానికి చెందిన బత్తుల నాగ సాయిరామ్ (సాయి) బుధవారం ఉదయం రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రిగా తన నియామకానికి సహకరించినందుకు కన్నబాబుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. సాయిని కన్నబాబు అభినందించి, బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పన శివ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



నాగులాపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

కొత్తపల్లి: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పశువైద్యాధికారి ఎస్. సందీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో పాడి రైతులకు బుధవారం ప్రభుత్వం ద్వారా లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీఎంఆర్ సంపూర్ణ దాణామృతం పథకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం టీఎంఆర్‌ను సబ్సిడీపై పాడి రైతులకు అందిస్తోందన్నారు. కేజీ దాణా రూ.15.80 కాగా ప్రభుత్వం రూ.9.30 సబ్సిడీతో పాడి రైతులకు రూ.6.50కే అందిస్తోందని తెలిపారు. ఒక్కో రైతు 1800 కేజీల వరకూ సబ్సిడీ పొందవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మానవత్వం చాటుకున్న శ్రీనివాస్



బాధితుడు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు నగదు, సరుకులను అందజేస్తున్న దృశ్యం

తుని: పుట్టెడు కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్న దాడిశెట్టి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు. తుని పట్టణం కిల్లాడ వారి వీధిలోకి చెందిన మొల్లి వెంకటేశ్వరరావుకు బ్రెయిన్ స్ట్రోకు వచ్చి పక్షవాతానికి గురయ్యాడు. దింతో రెండు కిడ్నీలు దెబ్బతిని మంచానికే పరిమితమయ్యాడు. విషయాన్ని స్థానికులు వాట్సాప్‌లో దాడిశెట్టి శ్రీనివాస్‌కు పంపారు. వెంటనే స్పందించిన ఆయన బుధవారం బాధిత కుటుంబానికి రూ.50 వేలు నగదు, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భానుడు రాకముందే బార్‌లా..!

- తెల్లవారక ముందే మద్యం విక్రయాలు
- సమయం పాటించని యజమాని
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు



తెల్లవారక ముందే బార్‌లో మద్యం అమ్మకాలు, తెరచి ఉంచిన సైడ్ డోర్

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న బార్ నిత్యం తెల్లవారక ముందే తెరుచుకుని మద్యం విక్రయాలు సాగిస్తోంది. 23వ వార్డు ముఖద్వారం వద్ద ఈ బార్‌ను మార్చాలని ఆ వార్డు ప్రజలు అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డుకు చేరుకోవడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒక మార్గంలో బార్, మరో మార్గం వద్ద ప్రభుత్వ మద్యం దుకాణం ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి మార్చి మహిళల రాకపోకలకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసిన మందు బాబులు బ్రాందీ షాపు సమీపంలో ఉన్న రోడ్డులో తాగుతున్నారు. ఈ విషయాలను పోలీసులు గమనించి కూడా మౌనం వహిస్తున్నారు. ఇక బార్‌లో మద్యం తాగడానికి వచ్చిన వినియోగదారులు తమ వాహనాల ను రోడ్డుపై నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలతో పాటు మహిళలు సైతం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బార్ వద్ద ఎత్తుగా కాంక్రీట్ వేయడం వల్ల చిన్న వాహన చోదకులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

నిబంధనలకు తూట్లు

మద్యం దుకాణాన్ని ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని ఐఎంఎఫ్ఎల్ డిపో మేనేజరు ఎస్.వరప్రసాద్ తెలిపారు. కాగా నిత్యం తెల్లవారక ముందే బార్ తెరిచి విక్రయిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు, మహిళలు ప్రశ్నిస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆ రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. దాంతో ఒంటరిగా వచ్చే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈ రోడ్డులో ఉన్న కల్వర్టుపై గుంపులు గుంపులుగా కూచుని మద్యం తాగుతున్నా అడిగేవారే లేకపోయారు. పోలీసులు అడపా దడపా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి



తెల్లవారు జాము నుంచే మద్యం దుకాణం సైడ్ డోర్ నుంచి మందుబాబులకు ప్రవేశం కల్పిస్తున్నారు. బార్‌లో మద్యం తాగి ప్లాస్టిక్ గ్లాస్, వాటర్ ప్యాకెట్లను డ్రైనులో వేస్తున్నారు. దాంతో డ్రైనులో పూడిక పెరిగిపోతోంది.

– పడాల వీరబాబు, 23వ వార్డు నివాసి, సామర్లకోట.

బార్ వేళలు పాటించేలా చర్యలు



బార్‌కు ప్రభుత్వం ఇచ్చిన వేళలను తప్పని సరిగా పాటించేలా చర్యలు తీసుకుంటాం. బార్ నిర్వాహకులను పిలిచి హెచ్చరిస్తాం. రోడ్లపై మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని ప్రదేశాల్లో హెచ్చరిక, అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం.

– కె.దుర్గాప్రసాద్, సీఐ, సామర్లకోట

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన మున్సిపల్ నోడల్ అధికారి సుజాత

సామర్లకోట: శిక్షణతో అనేక కొత్త విషయాలు తెలుస్తాయని, ప్రతి ఒక్కరూ శిక్షణపై పూర్తి బాధ్యతతో వ్యవహరించి సద్వినియోగం చేసుకోవాలని పిఠాపురం మున్సిపల్ నోడల్ అధికారి సీహెచ్ సుజాత అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న ఏడో బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. ప్రభుత్వం సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను సీరియస్‌గా తీసుకుని నేర్చుకోవాలన్నారు. ఫ్యాకల్టీ శ్రీకై లాస్ శిక్షణ ఇవ్వగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు యు.జ్యోతి రామ్, ఎస్‌వీ రామారావు, కె శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఖైదీలకు వైద్య పరీక్షలకు చర్యలు



ఖైదీలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు

పెద్దాపురం: బయట సమాజంలో ఉన్న వ్యక్తులకే కాకుండా జైలులో ఉంటున్న ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు స్థానిక సబ్‌జైలు అధికారి వై.శ్రావణ్‌కుమార్, ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్లు బి.శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి పీడీ, డైరెక్టర్ జనరల్ జైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైలులో ఉన్న వారికి కూడా మంచి ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఖైదీలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు వ్యాధులపై ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఎల్‌టీ ఓలేటి ఏసుబాబు, వైజ్ మేనేజర్ రాజు, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శాంతివర్ధన పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



గుడివాడ కృష్ణాష్టమి వేడుకల్లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పెద్దాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ కృష్ణుడి గుడి వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రుక్మిణీ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్బన్, ఆయా గ్రామాల్లో ఉన్న వైష్ణ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో..

మండలంలోని గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో ఆశ్రమ గురువు గవరసాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ ఉపన్యాసం చేశారు. అనంతరం భారీ అన్నదానం ఏర్పాటు చేయగా వందల సంఖ్యలో భక్తులు అన్న సమారాధనలో భాగస్వాములయ్యారు. ఉప్పలూరి గంగాధరం, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, కనపర్తి సూర్యుడు, చవ్వాకుల అప్పారావు, నల్లంశెట్టి సూరిబాబు, కనపర్తి బాబ్జీ, చవ్వాకుల నానాజీ, గుండాబత్తుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తిరెడ్డిపేటలో..

పట్టణంలోని స్థానిక సత్తిరెడ్డిపేట భగవద్గీతాలయంలో భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి భగవద్గీత పారాయణం చేసి ఆధ్యాత్మిక ప్రసంగం అందించారు. సత్యకుమార్, శ్రీదేవి, వేదమాత, భక్తులు పాల్గొన్నారు.

శాంతివర్ధనలో..

మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో కష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య ఆధ్వర్యంలో చిన్నారులను రాధా, కృష్ణ వేషాధారణలో తయారు చేసి ఉట్టి కొట్టించారు. పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ఏఓ వేణు, బాబి తదితరులు పాల్గొన్నారు.

కాండ్రకోటలో..

మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న కృష్ణాలయం వద్ద జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ భద్రరావు, తుమ్మారి రాజా, ఒబిలిశెట్టి వెంకటేశ్వర సిద్ధాంతితో పాటు పలువురు గ్రామ పెద్దలు ఆలయం వద్ద పూజల్లో పాల్గొనగా, పలువురు దంపతులు రుక్మిణీ కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉట్టు కొట్టడంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే దొరబాబు



మత్స్యకారుడు చిన్నబ్బాయికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మత్స్యకారులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు జగ్గరాజుపేట వాసి కారే చిన్నబ్బాయికి చెందిన బోటును అమీనాబాదు తీరప్రాంతంలో లంగరు వేయగా బ్యాక్ వాటర్ వాల్‌ను ఇటీవల ఢీకొట్టింది. దీంతో బోటు పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో బుధవారం ఎమ్మెల్యే దొరబాబు పరామర్శించి రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు తమ బోట్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేలు అందిస్తారన్నారు. అమీనాబాదు మేజర్ హార్బర్ నిర్మాణం మత్స్యకారులకు వరమన్నారు. ఈ హార్బర్ నిర్మాణంతో తీరప్రాంత రూపురేఖలు పూర్తిగా మారతాయని తెలిపారు. ఆయన వెంట మండల కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మత్స్యకార నాయకులు కంబాల లక్ష్మణ్, నక్కా మణికంఠ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నేరుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక కొత్త పింఛన్ రావడం గగనమన్నారు. పాత పింఛన్ దారుడు ఎవరైనా చనిపోతేనే కొత్తది ఇచ్చేవారని, అది కూడా అర్హత ఉన్న వారికి కాకుండా జన్మభూమి కమిటీ చెప్పిన వారికే ఇచ్చేవారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు వస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీ పండుగ రోజుగా మారిందన్నారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా, పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారుల ఇంటికే తెచ్చి పింఛన్లు ఇవ్వడం చరిత్రలో ఎక్కడా లేదన్నారు. అనంతరం కొత్త పింఛన్‌దారులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.


నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన



వివేకానంద పార్కులో అవగాహన కల్పిస్తున్న ఐ బ్యాంకు ప్రతినిధులు

బాలాజీచెరువు: అంధత్వ రహిత జిల్లాగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐబ్యాంక్ కార్యదర్శి దాసరి సాయికృష్ణ పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన నేత్రదాన అవగాహన కరపత్రాలు నగరంలోని పలు పార్కులలో వాకర్లు, పాదచారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ ఐ బ్యాంక్ ద్వారా అందిస్తున్న కంటి వైద్య సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐబ్యాంక్ ట్రస్టీలు సీమకుర్తి పాపారావు, పైడా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదస్థాయి దాటితేనే సస్య రక్షణ చేపట్టాలి



కొరుపల్లి పొలంబడిలో పంట పరిస్థితిపై చర్చిస్తున్న ఎంపీఓ రాజేష్

కరప: మండలంలోని కొరుపల్లిలో బుధవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఎంపీఓ రాజేష్ పాల్గొని సార్వాలో రైతులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదవస్థాయి దాటితేనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తెగుళ్ల నివారణకు పరిష్కార మార్గాలను ఆయన సూచించారు.

సర్పవరంలో ఆక్రమణల సర్వే



పీనుగుల పుంత ఆక్రమణలపై డీపీఓ విక్టర్, తహసీల్దార్ మురార్జీ ఆధ్వర్యంలో సాగుతున్న సర్వే

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో పీనుగుల పుంత ఆక్రమణలపై హైకోర్టు ఆదేశాల మేరకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు బుధవారం కొలతలు తీసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామ సెంటరు వరకు సర్వే చేశారు. సర్వేలో డీపీఓ విక్టర్, తహసీల్దార్ మురార్జీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో సాయి, సర్వేయర్ గోపాలాచార్యులు పాల్గొన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ సర్వే నంబరు 34లో పీనుగుల పుంత ఆక్రమణలో ఉందని, చాలా అసౌకర్యానికి గురువుతున్నామని, వాటిని తొలగించాలని సర్పవరానికి చెందిన పుల్ల సత్తిబాబు హైకోర్టు ఆశ్రయించారని, ఈ మేరకు విచారణ చేశామని, నివేదికను హైకోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. కాగా పీనుగుల పుంత మొత్తం ఆక్రమణలపై కాకుండా కేవలం దళితులకు చెందిన నాలుగు ఇళ్లకు సంబంధించి పేర్లతో హైకోర్టును ఆశ్రయించడాన్ని తాము ఖండిస్తున్నామని స్థానిక దళిత నాయకుడు విజయకుమార్ అన్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సరకు, నిందితులతో పోలీసులు

తుని: విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేశామని తుని పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. బుధవారం తుని పట్టణం సీతారాంపురం వద్ద జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. కాకినాడ రూరల్ మండలం, కాకినాడ పట్టణం, తమిళనాడు సేలంకు చెందిన మీసాల షణ్ముఖ, జగడం చైతన్య సిద్ధార్థ, జగన్నాథం పెద్దిరాజు, కార్తి కలిసి 22 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. దీని విలువ రూ.1.10 లక్షలు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా చింతపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి 22 కిలోల గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు తరలిస్తున్నట్టు విచారణలో తెలిపారు. వీరంతా చెడు వ్యసనాలకు లోనై అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. కాకినాడకు చెందిన మీసాల షణ్ముఖపై రెండు కేసులు, జగడం చైతన్య సిద్ధార్థపై కాకినాడ, రాజమహేంద్రవరం, కిర్లంపూడిలో ఆరు కేసులు, జగన్నాథం పెద్దిరాజుపై సర్పవరం, ముమ్మిడివరంలో రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. గంజాయి కేసును పట్టుకున్న పోలీసులను డీఎస్పీ లతాకుమారి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ కల్చరల్: సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రి కళాప్రాంగణంలో ఈ నెల పదో తేదీన విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాడి చంద్రశేఖర్ తెలిపారు. పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులు జూనియర్స్, 9 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు సీనియర్స్ విభాగంగా పరిగణిస్తామని తెలిపారు. అలాగే ఉత్తమ హిందీ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు.

అచ్చంపేట జంక్షన్‌లో హోటళ్ల తనిఖీ

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్‌లో మూడు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారి కేవీ సుబ్బారావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి నోటీసులు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఆయా హోటళ్లపై వచ్చిన ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆదేశాలతో ఈ తనిఖీలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

ఏలేరు కాలువలో వ్యక్తి గల్లంతు

ఏలేశ్వరం: మండల పరిధిలోని ఏలేరు ఎడమ కాలువలో బుధవారం వ్యక్తి గల్లంతయ్యాడు. కాకినాడకు చెందిన చింతాడ రాజు (48) తన స్నేహితులతో కలిసి అడ్డతీగల మండలం గొంటువానిపాలేనికి శుభకార్యం నిమిత్తం వెళ్లాడు. మార్గమధ్యలో ఏలేరు ఎడమ కాలువలోకి స్నానానికి దిగి గల్లంతయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా

3 బంగారు, 2 రజత, 2 కాంస్య పతకాలు సొంతం



పతకాలు సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి, కోచ్, జాతీయస్థాయి రిఫరీ బి.అర్జునరావు వద్ద శిక్షణ పొందుతున్న బి.శ్రీస్నేహ 1 బంగారు, 1 రజత, ఎస్.మోక్షజ్ఞ 1 బంగారు, జి.యశ్విత 1 కాంస్య, వై.సాక్షికుమారి 1 రజత పతకం కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో బి.హర్షవర్ధన్ 1 బంగారు, బి.నాగదీపక్ చరణ్ 1 కాంస్య పతకం అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి కె.స్వర్ణరాజు, డీఎస్ఏ సీఈఓ రమణి, ముఖ్యశిక్షకులు బి.శ్రీనివాస్‌కుమార్, జాతీయస్థాయి రిఫరీలు మూర్తి, బి.అఖిల, ఎన్.తులసి బుధవారం అభినందించారు.